క్లుప్తంగా

హోటల్‌కు జరిమానా



జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని రామలింగేశ్వర టాకీస్ రోడ్డులో గల కింగ్ ప్యాలెస్ రెస్టారెంట్‌ను మున్సిపల్ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే రెస్టారెంట్‌లో ఫ్రిజ్‌లో నిల్వ ఉన్న చికెన్ పదార్థాలను గుర్తించి హోటల్‌కు రూ.4వేల జరిమానా విధించారు. అదే విధంగా పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో చెత్తపోసిన కొబ్బరిబోండాల షాపు యజమాని వి.వెంకన్నకు రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ మస్కాపురం సురేష్, జవాన్లు కొండేటి వెంకన్న, పరశురాములు, పోతుగంటి వేణు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



తిరుమలగిరి అంగన్వాడీలో మహిళలకు ఆహార పదార్థాలు అందిస్తున్న సిబ్బంది

తిరుమలగిరి : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డాక్టర్ వందన అన్నారు. శనివారం తిరుమలగిరిలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రక్తహీనత రాకుండా ఆకుకూరలు, పప్పు దినుసులు తినాలని వివరించారు. అంగన్వాడీ సెంటర్‌లలో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం, పౌష్టికాహారం ప్రదర్శన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శాంతయ్య, సూపర్‌వైజర్లు కందుకూరి మంగమ్మ, ఎండీ ఖైరున్నిసా, ప్రమీల, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడీ హెల్పర్లు, ఆశాలు పాల్గొన్నారు.

లోయపల్లిలో పోషణ పక్వాడ

అర్వపల్లి : మండల పరిధిలోని లోయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహారం తిని ఆరోగ్యంగా ఉండాలని అంగన్‌వాడీ కేంద్రం టీచర్ వల్లపు నాగమణి కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సోమమ్మ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

21న కంటి వైద్యశిబిరం

భానుపురి : రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో ఈ నెల 21వ తేదీన వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీ విజన్ లేజర్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పా టు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాం సుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు పెన్షనర్లు తమ హెల్త్ కార్డులను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఆయిల్‌పామ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ అశోక్

తుంగతుర్తి : ఆయిల్‌పామ్ తోటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని డివిజన్ ఫీల్డ్ ఆఫీసర్ అశోక్ అన్నారు. శనివారం బండ రామారం గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఆయిల్‌పామ్ తోటలు సాగు చేయాలనుకునే రైతులు ఉద్యానశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న పలు క్షేత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు ఎలగందుల రమేష్, రైతులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే సామేల్ పరామర్శ

మద్దిరాల : చందుపట్ల గ్రామానికి చెందిన ఈదులకంటి భిక్షం శుక్రవారం ఎర్రపహాడ్‌లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెడుతుండగా ప్రమాదవశాత్తు గుండెపోటుకు గురై మృతి చెందాడు. శనివారం మృతుడి చిత్రపటానికి ఎమ్మెల్యే మందుల సామేల్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయనవెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవిలమల్లు యాదవ్, నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పచ్చిపాల సుమతి వెంకన్న, తదితరులు ఉన్నారు.

బెల్టుషాపుల నిర్వాహకుల బైండోవర్

నూతనకల్ : మిర్యాల గ్రామానికి చెందిన బెల్టుషాపు నిర్వాహకులను పోలీసులు శనివారం తహసీల్దార్ శ్రీనివాసరావు ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. బెల్టుషాపులు నిర్వహిస్తే జరిమానా విధించి, కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కేంద్రాల ఏర్పాటులో గందరగోళం!

- అధికారుల సమన్వయ లోపంతో రైతులకు ఇబ్బందులు
- ఉన్నచోటే నాలుగైదు కేంద్రాలు ఏర్పాటు.. కొన్ని ప్రాంతాల్లో సున్నా
- కొనసాగుతున్న ప్రైవేట్ సంస్థల హంగామా



ఆత్మకూరులో నిలిచిన కాంటాలు



మక్తాకొత్తగూడెంలో రైతులు పోసిన ధాన్యం

ఆత్మకూర్ (ఎస్) : రైతులు తాము పండించిన ధాన్యాన్ని తమ గ్రామంలోనే అమ్ముకునేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా కేంద్రాలను అస్తవ్యస్తంగా ఏర్పాటు చేస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నచోటనే నాలుగైదు కేంద్రాలకు అనుమతులు ఇస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అసలు సెంటర్‌కే అవకాశం లేకుండా చేశారు. ప్రస్తుతం వరి కోతలు తీవ్రమై ధాన్యం పెద్ద ఎత్తున కేంద్రాలకు తరలివస్తున్న నేపథ్యంలో కొనుగోళ్లలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎక్కువగా సన్నరకం ధాన్యాన్ని తీసుకొచ్చే ప్రాంతాల్లో దొడ్డురకం కేంద్రాలను, దొడ్డురకం తెచ్చే ప్రాంతాల్లో సన్నరకం కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

నిలిచిన కాంటాలు..

ఆత్మకూరు మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ పక్కన పీఏసీఎస్ ఆధ్వర్యంలో సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో దొడ్డు రకం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా రామోజీతండాకు చెందిన సన్నరకం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రంలో దొడ్డురకం ధాన్యం కొనేందుకు నిర్ణయించారు. అయితే రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలోని దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం కాంటాలు వేసేందుకు సిద్ధమవుతుండగా పీఏసీఎస్ అధికారులు వచ్చి అడ్డుకున్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘానికి, పీఏసీఎస్ అధికారులకు మధ్య విభేదాలు తలెత్తి కాంటాలు నిలిచాయి.

దొడ్డు రకం కేంద్రం ఉండాల్సిన చోట..

పాత గ్రామపంచాయతీ ప్రకారం కందగట్ల గ్రామంలో నాలుగు కేంద్రాలు (3 దొడ్డు, 1 సన్నరకం) ఏర్పాటు చేశారు. ఇందులో కందగట్ల వీఓ -1కు సన్నరకం కేంద్రాన్ని ఇవ్వగా ఇక్కడ రైతులందరూ దొడ్డురకం ధాన్యాన్ని పోశారు. రెండు, మూడు రోజులుగా రైతులు అధికారులను కేంద్రాన్ని దొడ్డు రకంగా మార్చాలని అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. శుక్రవారం కేంద్రాన్ని పరిశీలించేందుకు డీపీఎం ఆంజనేయులు, ఏపీఎం మంజుల వచ్చారు. రైతులు అధికారులకు సమస్యను విన్నవించారు. దీంతో వారు స్పందించి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

ఒక్క కేంద్రం కూడా లేకపోవడంతో..

మక్తాకొత్తగూడెం గ్రామంలో 200 మంది రైతులు 400 ఎకరాల వరకు వరిని సాగు చేసినా ఇక్కడ ఏ సెంటర్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు గతంలో సెంటర్‌ను పెట్టిన చోట ధాన్యం రాశులు పోశారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయాలని విన్నవించినా అతీగతీ లేకుండా పోయింది. ఇదే అదునుగా మోతె మండలం నుంచి ప్రైవేటు వ్యక్తులు వచ్చి సన్నరకం ధాన్యాన్ని మాత్రమే.. అదీ తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. మండలంలో మ్యాక్స్ అనే ప్రైవేటు సంస్థ అనేక చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద ధాన్యాన్ని ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తోంది. ప్రధానంగా ధాన్యం కొనుగోలు సెంటర్ల ఏర్పాటులో మండల కమిటీ పూర్తిగా విఫలమైందనే ఆరోపణలు వస్తున్నాయి. అస్తవ్యస్తంగా కేంద్రాలను ఏర్పాటు చేశారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పక్క గ్రామం వెళ్లి అమ్ముకోవాల్సి వస్తుంది



గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. గతంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన ప్రాంతంలో 20పుట్ల ధాన్యం పోశాను. అధికారులు ఇప్పుడు కేంద్రం లేదని చెప్పడంతో ఏం చేయాలో తోచడం లేదు. ధాన్యాన్ని పక్క గ్రామం వెళ్లి అమ్ముకోవాల్సి వస్తుంది. లేకుంటే ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాలి.

– బద్దం ధర్మారెడ్డి, మక్తాకొత్తగూడెం

రైతులు ఇబ్బంది పడుతున్నారు



గతంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈ సంవత్సరం అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో ఏర్పాటు చేయలేదు. దీంతో దాదాపు 200 మంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. నా ఇద్దరు కుమారులు కలిసి దాదాపు 50పుట్ల వడ్లు కొనుగోలు కేంద్రంలో పోశారు. కానీ కొనే దిక్కు లేదు. ఎవరిని సంప్రదించినా పట్టింపు లేదు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

– ఏర్పుల చంద్రయ్య, రైతు, మక్తాకొత్తగూడెం

అందాల పోటీలను రద్దుచేయాలి



వినతిపత్రం ఇస్తున్న మహిళా నాయకులు

సూర్యాపేట అర్బన్ : హైదరాబాద్‌లో మే 7 నుంచి 31 వరకు నిర్వహించే ప్రపంచ అందాల పోటీలను రద్దు చేయాలని కోరుతూ ఐద్వా, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మద్దెల జ్యోతి మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీల కోసం మహిళలను విలాస వస్తువులుగా చూపిస్తూ.. హైదరాబాద్‌లో ప్రపంచ అందాల పోటీలను నిర్వహించడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు మారసాని చంద్రకళ, ఐద్వా నాయకులు సైదమ్మ, జ్యోత్స్న, లక్ష్మి, పావని, కట్ట కల్పన, అయితరాజు పద్మ, రేణుక, శ్రీదేవి, చిట్టి, గుండగాని రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలి



అవగాహన కల్పిస్తున్న షీ టీం ఎస్‌ఐ నీలిమ

సూర్యాపేటటౌన్: విద్యార్థినులను ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని షీటీం ఎస్‌ఐ నీలిమ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు మహిళల రక్షణ చట్టాలు, భద్రత గురించి జిల్లా పోలీస్ షీటీం, పోలీస్ భరోసా టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, భరోసా టీం సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోళ్లలో నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందులు



సూర్యాపేట - నేరేడుచర్ల రహదారిపై రాస్తారోకో చేస్తున్న మల్లు నాగార్జునరెడ్డి, రైతులు

సూర్యాపేటఅర్బన్: ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. సూర్యాపేట మండలం ఇమాంపేటలోని ఐకేపీ కేంద్రం రైతులతో కలిసి సీపీఎం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం సూర్యాపేట– నేరేడుచర్ల రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెల రోజుల నుంచి ఐకేపీ కేంద్రాల్లో రైతులు ఎదురుచూస్తున్నా ధాన్యం కొనుగోళ్లలో అధికారులు జాప్యం చేస్తున్నారని అన్నారు. కాంటాలు వేసిన ధాన్యం ఎగుమతికి లారీల కేటాయింపు సరిగా లేదని తెలిపారు. 20 రోజుల క్రితం రెండు లారీల్లో ధాన్యాన్ని ఎగుమతి చేసి మిల్లర్ల వద్దకు పంపితే నేటికీ దిగుమతి కాలేదని అన్నారు. వాతావరణంలో మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరిస్తామని సివిల్ సప్లయ్ అధికారులు, తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దండా వెంకటరెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకనబోయిన శేఖర్, వేల్పుల వెంకన్న, సీపీఎం మండల కార్యదర్శి మేరెడ్డి కృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు నాగిరెడ్డి, శేఖర్‌రెడ్డి, నాయకులు గుండాల పుల్లయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



తుంగతుర్తి : తూర్పుగూడెంలో ర్యాలీని ప్రారంభిస్తున్న చెవిటి వెంకన్న యాదవ్

తుంగతుర్తి : రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. శనివారం గానుగుబండ, తూర్పుగూడెం గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, గ్రామ శాఖ అధ్యక్షుడు గుండగాని సుధాకర్, గుండగాని మహేందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, మండల మహిళా అధ్యక్షురాలు పులి సత్తెమ్మ, రుద్ర రామచంద్రు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

చివ్వెంల : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శనివారం వారు మండల పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ తండాలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, నాయకులు అమరారపు శ్రీనివాస్, మధుకర్ రెడ్డి, యల్కపల్లి వెంకన్న, జాఫర్, దొనకొండ వీరయ్య, బోడపట్ల శ్రీను, రమేష్, నాగు నాయక్, సోమిరెడ్డి, చిన్న, తిరుమల చారి, వినోద్, కిషన్, లచ్చ వెంకన్న, రవి నాయక్, రెడ్డి నాయక్, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : లక్ష్మణ్‌నాయక్ తండాలో ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



తిరుమలగిరి: గుండెపురిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని తిరుమలగిరి వ్యవసాయ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్ అన్నారు. శనివారం గుండెపురి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాలు పాల్గొన్నారు.

అర్వపల్లి : రైతులకు మద్దతు ధరను కల్పించడం కోసమే ప్రభుత్వం గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. కోమటిపల్లి గ్రామంలో లక్ష్మీనర్సింహ మ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జాల నర్సయ్య, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, ఏఎంసీ డైరెక్టర్ జలంధర్, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, దల్వాయి రేఖశ్రీధర్, మాదగాని విక్రం, జాల అవిలయ్య, మాంద్ర లింగయ్య, సూర్యం, వీరయ్య, లింగయ్య, శ్రీనివాస్, యాదగిరి, వీరయ్య, నరేష్ పాల్గొన్నారు.

కాంటాలను త్వరితగతిన నిర్వహించాలి

నూతనకల్ : కొనుగోలు కేంద్రాల్లో కాంటాలను త్వరితగతిన నిర్వహించాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఎర్రపహాడ్, దిర్శనపల్లి గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, రేషన్ డీలర్ అశోక్, రైతులు పాల్గొన్నారు.

బెదిరింపులకు గాంధీ కుటుంబం భయపడదు

అర్వపల్లి : భారత స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదురించి పోరాడిన గాంధీ కుటుంబం ఈడీ, సీబీఐ బెదిరింపులకు భయపడదని రాజ్యాంగ పరిరక్షణ యాత్ర మండల కోఆర్డినేటర్, మాజీ సర్పంచ్ జీడి వీరస్వామి అన్నారు. అర్వపల్లిలో శనివారం జరిగిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పదేళ్ల బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రక్షణ కరువైందని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మందుల అవిలయ్య, కొమారి మల్లయ్య, ఇటికాల చిరంజీవి, సిద్ది రాము, జీడి వెంకన్న, మాతంగి నవీన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని లింగాల గ్రామంలోని శ్రీకనకదుర్గ దేవాలయ గోపుర నిర్మాణానికి నారాయణపేట జిల్లాలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన నల్లపు లింగయ్య రూ. 50,116లను తన సహోదరుడు, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ నల్లపు వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆలయ కమిటీ చైర్మన్ కేసిరెడ్డి కోటిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ దేవాలయ గోపుర నిర్మాణానికి దాతలు సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి మామిడి అరవిందు, గౌరవ సలహాదారులు మామిడి శ్రీనివాస్, కమిటీ సభ్యులు బట్టిపల్లి సైదులు, దూదిపాల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

సూర్యాపేట అర్బన్ : వేసవిలో మున్సిపాలిటీ నల్లాల ద్వారా సరిపోను నీటిని అందించాలని పలువురు మహిళలు అధికారులను వేడుకున్నారు. శనివారం వారు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేసి మాట్లాడారు. వేసవి కాలం కావడంతో తీవ్ర మంచినీటి ఎద్దడితో విలవిలలాడుతున్నామని తెలిపారు. రెండు, మూడు రోజులకు ఒకసారి అరగంట పాటు నల్లా వస్తే ఆ నీళ్లు ఏ మూలకు సరిపోవడం లేదన్నారు. సంపులో మోటార్ పెట్టి పైన ట్యాంకులకు నీళ్లు ఎక్కించుకుంటే అవి నల్లాకు పెట్టామంటూ మున్సిపల్ అధికారులు మోటార్లను అక్రమంగా తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బొమ్మకంటి రమణ, సూరపల్లి భాగ్య, స్వాతి, సొడం సక్కుబాయి, రాధా రుక్మిణి, నీరజ, ఇందిర, భాగ్యమ్మ, సత్తెమ్మ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఆటో డ్రైవర్లకు న్యాయం



ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

సూర్యాపేటటౌన్ : బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఆటో డ్రైవర్లకు న్యాయం జరిగిందని బీఆర్‌టీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు సైదులు అన్నారు. ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభకు గానూ శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రూ.10116 చెక్కును మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆటో డ్రైవర్లు ప్రమాదంలో చనిపోతే బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆటో యూనియన్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా వచ్చేదని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రావడం లేదన్నారు. కార్యక్రమంలో వై.వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, యూనియన్ నాయకులు షేక్ అహ్మద్, సీహెచ్.వెంకన్న, జాన్ పాషా పాల్గొన్నారు.

'భూ భారతి'తో రైతులకు న్యాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్



నాగారం : సంతను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తిరుమలగిరి : భూ సమస్యల పరిష్కారానికే కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ భారతి' చట్టాన్ని తెచ్చింది.. దీని ద్వారా రైతులకు సరైన న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో అదనపు కలెక్టర్ రాంబాబు అధ్యక్షతన భూ భారతి ఆర్ఓఆర్–2025 చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణిలో చాలా పొరపాట్లు జరిగాయని, అర్హులైన రైతులు నష్టపోగా పాలకులు వేల ఎకరాల భూమిని కబ్జా చేశారని అన్నారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, తహసీల్దార్ హరిప్రసాద్, ఎంపీడీఓ లాజరస్, వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికే..

నాగారం : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం ఫణిగిరి ఆనంద్ గార్డెన్స్‌లో భూ భారతిచట్టం -2025పై నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబులో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ భారతి చట్టం రైతుల చుట్టం లాంటిదన్నారు. ఆరేళ్లుగా ధరణిలో ఎదురవుతున్న సమస్యల నుంచి రైతులకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాలేపు చంద్రశేఖర్, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ మారయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యారాల ఇంద్రసేనారెడ్డి, ఏఓ బాలక్రిష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంతను ప్రారంభించిన ఎమ్మెల్యే సామేల్

పస్తాల–లక్ష్మాపురం మెయిన్‌రోడ్డుపై నూతనంగా ఏర్పాటు చేసిన వారాంతపు సంత(అంగడి)ను శనివారం ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సంతలు ఏర్పాటు చేసుకోవడంతో చిరు వ్యాపారులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వారాంతపు సంతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకరి జనార్దన్, తొడుసు లింగయ్య, వడ్లకొండ వెంకన్న, వేణు, లింగయ్య, నాగమల్లు, వెంకన్న, యాకయ్య, వలీ, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెన్‌పహాడ్ : 11కేవీ విద్యుత్ తీగల మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్ శనివారం తెలిపారు. పెన్‌పహాడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెన్‌పహాడ్, మాచారం ఫీడర్‌ల కింద ఉన్న గ్రామాలకు ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

నాగారం : పిల్లలలో రక్తహీనత నివారణకు పండ్లు, డ్రై ఫ్రూట్స్, ఆకుకూరలు అందించాలని వర్ధమానుకోట పీహెచ్‌సీ డాక్టర్ యుగంధర్ సూచించారు. శనివారం మండల పరిధిలోని వర్ధమానుకోట ఆవాసం పాటిమీదిగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద, ఉపాధ్యాయులు మల్లయ్య, రజిత, అనిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



పెన్‌పహాడ్ : గూడెపుకుంట తండాలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెన్‌పహాడ్: ప్రభుత్వపాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పెన్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు అన్నారు. శనివారం గూడెపుకుంట తండాలో 6, 7, 8వ తరగతి విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యా బోధన అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, అనుములపురి శ్రీధర్, ఆనందభాస్కర్, హెచ్ఎం అల్లాడి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

మద్దిరాల : బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు అన్నారు. శనివారం చిన్ననెమిల, గోరెంట్ల, చౌళ్లతండా, కుక్కడం, కుంటపల్లి, మామిండ్లమడవ గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో బడిబాట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా 20 మంది పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్. నాగరాజు, వి. యాదగిరి, రమేష్, జి. మంజుల, గ్రామస్తులు పోలెబోయిన కిరణ్, బింగి కృష్ణమూర్తి, పాక వీరేష్ పాల్గొన్నారు.



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో..



మద్దిరాల : కుక్కడంలో బడిబాట ర్యాలీ..